## ప్రసంగము 6

# శోధన గూర్చిన సత్యము

### (1 కొరింథీయులకు 10:13)

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు; దేవుడు నమ్మదగినవాడు, మీరు సహింప గలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు, అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగ జేయును" అని మనము 1 కొరింథీయులకు 10:13లో చదువుదుము.

శోధన గూర్చి అనేక అసత్య అభిప్రాయములు కలవు, మనము శోధనయను అంశము గూర్చి బైబిలులో బోధింపబడిన సత్యమును గ్రహించుటకు ప్రయాసపడినట్లయితే, ఆ అబద్ధపు అభిప్రాయములను మనము బయటపెట్టగలము.

"శోధన" గూర్చి బైబిలు ఏమి బోధిస్తున్నదో చూడక మునుపు, మనము ఈ మాటను నిర్వచింపవలెను. "శోధించు" అను మాటకు గ్రీకు పదము *peirazō.*[1] "శోధన" అను నామవాచక మాటకు గ్రీకు పదము *peirasmos.* ఈ మాటకు ప్రాథమిక అర్థము, "పరీక్షించుట" లేక "ఒక పరీక్షకు గురిచేయుట." క్రియా పదమునకు W. E. Vine ఈ క్రింది నిర్వచనముల నిచ్చుచున్నాడు: "(1) శోధించు, ప్రయత్నించు ... ; (2) పరీక్షించు, శోధించు, నిరూపించు."[2]

గ్రీకు పదము క్రొత్త నిబంధనలో ప్రాథమికముగా రెండు విధములుగా వాడబడినది: "శీలమును మరియు పురోగతిని బయటపెట్టవలెను మరియు ఉత్తేజపర్చవలెను" అని వాటి ఉద్దేశముగా కలిగియున్న కష్టాల (పాట్లు) సందర్భములో మరియు "చెడు చేయుటకు ప్రలోభపెట్టునవి" అని గ్రహించబడగల శోధన సందర్భములోను[3] వాడబడినది. ఈ పదము మత్తయి 16:1లో (మరియు ఇదే విధమైన వాక్యభాగములలో) పరిసయ్యులు యేసును పరీక్షించుటకు చూచినప్పుడు; 2 కొరింథీయులకు 13:5లో క్రైస్తవులు తమ్మునుతాము పరీక్షించుకొనవలెనని చెప్పబడినప్పుడు; మరియు యోహాను 6:6లో యేసు ఫిలిప్పును[4] పరీక్షించినప్పుడు వాడబడినది. పరీక్ష, లేక పాట్లు, క్రైస్తవులు వాటినెదుర్కొను ఆయా సమయములలో విశ్వసనీయమైనవారుగా నిలిచియున్నట్లయితే అవి ఒక ప్రయోజనకరమైన ప్రభావమును కలిగి యుండగలవు. "నా సహోదరులారా, ... మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి" మరియు "శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవ కిరీటము పొందును" అని మనము చదువుదుము (యాకోబు 1:1, 12).

ఏదిఏమైనా, యాకోబు 1:14, 15లో "ప్రతివాడును తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరులుకొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును" అని వ్రాయబడి యున్నట్లు ఈ పదము "చెడు చేయుటకు" ఊరింపబడుటను కూడ సూచించును. ఈ పదము క్రొత్త

నిబంధనలో వాడబడినప్పుడు, అతి తరుచుగా అది పాపము చేయుటకు శోధింపబడుటను సూచించుచున్నది. మనకు సంబంధించిన అర్థము ఇదే. శోధన గూర్చి ప్రజలు కొన్ని పర్యాయములు విశ్వసించు అబద్ధపు అభిప్రాయములను బైబిలు బోధించుచున్న సత్యములతో మనము పోల్చి చూద్దాము.

### అబద్ధము నెం. 1

**అసత్యము: "నీవు పాపము చేయునట్లు దేవుడు నిన్ను శోధిస్తాడు."**

**సత్యము: మనము పాపము చేయునట్లు దేవుడు మనలను శోధించడు, కానీ మనము శోధింపబడునట్లు ఆయన అనుమతిస్తాడు.**

దేవుడు మనలను శోధిస్తాడు అను భావము శోధన గూర్చిన మొదటి అబద్ధమై యున్నది. యాకోబు 1:13, "దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు, 'నేను దేవునిచేత శోధింపబడుచున్నానని' అనకూడదు" అని చెప్పుచున్నది.

దేవుడు మనలను శోధించడని ఈ వాక్యభాగము మనకు సామాన్యముగా బోధించుచున్నది.[5] దేవునికిని శోధనకును ఏమైనా సంబంధం ఉన్నదా? ఔను, ఉన్నది, మనము శోధింపబడుటకు దేవుడు మనలను అనుమతిస్తాడని కూడ బైబిలు బోధించుచున్నది. ఆదాము మరియు హవ్వ శోధింపబడునట్లు ఆయన అనుమతించాడు, మరియు యోబును శోధించునట్లు అపవాదికి ఆయన అనుమతినిచ్చాడు. మన సహన శక్తికి మించి మనము శోధింపబడుట దేవుడు అనుమతించడని పౌలు వ్రాసినప్పుడు (1 కొరింథీయులకు 10:13), మనము శోధింపబడునట్లు దేవుడు అనుమతిస్తాడని సూచించాడు.

అలాగైతే, ఈ రెండింటికి నడుమ గల భేదమేమై యున్నది? ఉదాహరణంగా వివరించుటకు, మాదక ద్రవ్యాలు ఉపయోగించకుడదని వారి పిల్లలకు నేర్పించుటకు వారి శాయశక్తులా ప్రయాసపడు తల్లితండ్రుల గూర్చి మనము ఊహించుకొనవచ్చును. పిల్లలను ఒక గది లోపల ఉంచి గది బయట నుండి తాళంవేసి వారు మాదక ద్రవ్యాలను అందించేవారితో గాని అమ్మేవారితోగాని ఎటువంటి సంబంధము లేకుండా చూచుట వారు హాని చేయు ఔషధములను సేవించకుండునట్లు వారిని నిరోధించగల ఒక మార్గమైయున్నది. ఏదిఏమైనా, తల్లితండ్రులు ఈ పని ఎల్లకాలము చేయుగలరా? లేదు, నిజంగానే చేయలేరు. పిల్లలు పెరుగుచూ పెద్దవారౌతుంటారు గనుక వారు ఇంటికి వెలుపలగల ప్రపంచాన్ని – వారు శోధనలకు గురి యగుటకు మెండైన అవకాశములు గల లోకమును – ఎదుర్కొనగలుగునట్లు అనుమతించవలెను. పిల్లలు మాదక ద్రవ్యాలను ఉపయోగించు శోధనకు గురైనట్లయితే, వారు సరైన నిర్ణయము తీసికొనగలుగునట్లు వారు వారి పిల్లలకు చాలినంత కంటె ఎక్కువే చక్కగా నేర్పించారని, తల్లిదండ్రులు అనుకొంటారు. ఏదిఏమైనా, ఒక వేళ, అబ్బాయి/అమ్మాయి తప్పుడు తీర్మానం తీసుకొన్నట్లయితే, అది తల్లిదండ్రుల తప్పై యుండునా? ఒక విధంగా చూస్తే, అబ్బాయి/అమ్మాయి శోధింపబడునట్లు తల్లిదండ్రులు అనుమతించినట్టే ఔతుంది, కానీ పిల్లలను శోధించినది ఖచ్చితంగా తల్లిదండ్రులు కాదు కదా! అలాగే, మనము తప్పుడు

ఎంపికలు చేసికొనకుండునట్లు దేవుడు ఆయన చేయవలసినదంతా చేస్తాడు. మనము మన స్వంత నిర్ణయములను తీసికొనగలగునట్లు మనకు స్వతంత్రమునిచ్చుట ద్వారా, మనము శోధింపబడునట్లు ఆయన అనుమతించుచుండును; కానీ ఆయనే మనలను శోధించడు. మనము ఎంపికలను మరియు శోధనలను ఎదుర్కొనునట్లు మనలను అనుమతించుట ద్వారా, మనము మన స్వతంత్ర చిత్తము చొప్పున ఆయనను ప్రేమించుటకును ఆయనకు విధేయులమై యుండుటకును ఆయన మనకు ప్రత్యేకార్హతను అనుగ్రహిస్తాడు.

### అబద్ధము నెం. 2

**అసత్యము: "నీవు పాపము చేయునట్లు సాతాను నిన్ను ప్రోత్సాహించాడు."**

**సత్యము: సాతాను మనలను శోధిస్తాడు, కానీ మనము పాపము చేయునట్లు వాడు మనలను బలవంతము చేయలేడు.**

ఈ అబద్ధమును మనమందరమూ విన్నాము – అంతమాత్రమేగాక మనము: "నేనిలా చేయడానికి సాతానే కారణం!" అని కూడ మనము చెప్పుకొన్నాము. యిలా చెప్పుకొనడంలో కొంచెము అర్థమున్నది, కానీ అసలుకు అది నిజం కాదు.

ఔను, నిజమే, సాతాను మనలను శోధిస్తాడు. బైబిలులో అపవాది శోధకునిగా చిత్రీకరింపబడి యున్నాడు (మత్తయి 4:3). వాడు ఏదెను తోటలో ఆదాము హవ్వలను శోధించాడు (అదికాండము 3); వాడు యోబును శోధించాడు (యోబు 1; 2); వాడు యేసును శోధించాడు (మత్తయి 4:1–11); వాడు అననీయ మరియు సప్పీర అను భార్యభర్తలు పరిశుద్ధాత్మతో అబద్ధము చెప్పునట్లు వారిని శోధించాడు (అపొస్తలుల కార్యములు 5:3). వాడు "శోధకుడు" అని పిలువబడ్డాడు (1 థెస్సలొనీకయులకు 3:5) మరియు "మీ విరోధియైన అపవాది, గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా అని, వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతురు 5:8).[6]

ఏదిఏమైనా, చేయవలెనని మనము ఆశించని దానిని చేయునట్లు అపవాది మనలను చేయలేడు. దేవుడు అపవాదికి ఒక హద్దును నియమిస్తాడనియు, తత్ఫలితంగా మనము పాపము చేయునట్లు వాడు మనలను బలవంతము చేయలేడనియు యోబు కథ ఉదాహరణముగా తెలియజెప్పుచున్నది. "నేను ఆ పని చేయునట్లు సాతానే నన్ను ప్రోత్సాహించాడు" అనునది అసలు ఏమైయున్నదో అని చూడవలెను – అదొక అబద్ధము, మనము చేసినది తప్పని తెలిసికొనినప్పుడు మనలను మనము మన్నించుకొనునట్లు ప్రయత్నించుటకు చేయు ఒక మార్గము.

### అబద్ధము నెం. 3

**అబద్ధము: "నీవు ఎన్నడునూ శోధింపబడజాలనంత మంచివాడవై యుండగలవు."**

**సత్యము: అందరూ శోధించబడుదురు, మరియు వారు శోధింపబడజాలనంత మంచివారు ఏ ఒక్కరు కాజాలరు. ఆధ్యాత్మికంగా పరిపూర్ణులై యున్నవారు శోధనకు ఇతరులు**

**లొంగిపోవుచుండునంత తరుచుగా లొంగిపోరు.**

ప్రతి ఒక్కరు, వారు ఎంత మంచివారైనా సరే, శోధింపబడుట సాధ్యమే అని మనము తెలిసికొనవలెను. అపొస్తలుడైన పౌలు శోధింపబడ్డాడు (1 కొరింథీయులకు 9:26, 27 చూడుము). యోబు, "యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు" అని వర్ణింపబడినవాడు (1:1), శోధింపబడ్డాడు. దావీదు, దేవుని హృదయానుసారుడైనవాడు, శోధింపబడ్డాడు. ఆదాము మరియు హవ్వ, దేవుని పోలిక చొప్పున సృజింపబడినవారు శోధింపబడ్డారు. యేసు క్రీస్తు, దేవుని కుమారుడై యుండినవాడు సహితము, శోధింపబడ్డాడు (మత్తయి 4:1-11; హెబ్రీయులకు 2:17, 18; 4:14-16). యేసు క్రీస్తే శోధింపబడినట్లయితే, ప్రతి ఒక్కరు - వారు ఎంత మంచివారుగా ఉండుటకు ప్రయత్నించిననూ, శోధింపబడుదురు.

మనము శోధింపబడకుండునట్లు మనలను కాపాడు ఒక ఆధ్యాత్మిక పరిపూర్ణతా స్థాయిని సాధించామని ఆలోచించుటకు మొదలుపెట్టినప్పుడు, మనము మరొక పర్యాయము ఆలోచించాల్సి వుంటుంది. మనము 1 కొరింథీయులకు 10:12లో ఇవ్వబడిన హెచ్చరికను జ్ఞాపకముంచుకొనవలెను: "తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను."

మనము క్రీస్తులో పరిపూర్ణులమగుకొలది, శోధనను ఎదిరించుటకు మనము అంతకంతకు అధికముగా సమర్థవంతుల మగుదుము. యేసు చెప్పినట్లు "లేదు"/"కాదు" అని శోధకునికి చెప్పుట ఆయన అడుగుజాడలలో నడుచుకొనుటకు గల సామర్థ్యము క్రైస్తవ పరిపూర్ణతకు సంకేతమై యున్నది. "పరిపూర్ణుడైన క్రైస్తవుడు పాపరహితుడై లేడు, కానీ పరిపూర్ణుడైన క్రైస్తవుడు పాపము తక్కువగా చేయునని" మనము చెప్పుకొనవచ్చును.[7]

## అబద్ధము నెం. 4

**అసత్యము: "నీవు శోధింపబడినప్పుడు - అనగా, తప్పు చేయుటకు ఆశించినప్పుడు - అది ఒక పాపము."**

**సత్యము: శోధింపబడుట పాపము కాదు, కానీ శోధన పాపమునకు దారి తీయును.**

శోధింపబడుట అనగా ఏదో ఒకటి చేయవలెనని ఆశించుట అని అర్థము; కాబట్టి, పాపము చేయుటకు శోధింపబడుట అనగా పాపము చేయుటకు కోరిక కలిగియుండుట అని అర్థము. ఒకరి మీద ఆగ్రహము చెందుట లేక ఒక స్త్రీని మోహపు చూపుతో చూచుట పాపము చేసినట్లే అని యేసు చెప్పాడు గనుక (మత్తయి 5:22, 28), శోధింపబడుచుండుట - తప్పు చేయవలెనని ఆశించుట - పాపము చేయుటయే అని మనము ఒక తుది అభిప్రాయముగా చెప్పుకొనవచ్చును. ఏదిఏమైనా, యాకోబు 1:14, 15 ఇలా చెప్పుచున్నవి: "ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి, పాపమును కనగా; పాపము పరిపక్వమై, మరణమును కనును." పాపము ఎలా చేయబడుతుంది, మరియు పాపము ఎక్కడికి దారితీస్తుంది? ఇప్పుడు చూద్దాము.

1. పాపము చేయుటకు ఒక అవకాశమున్నది. ఆ అవకాశమును అపవాది సమకూర్చును మరియు/లేక అట్టి అవకాశమును సానుకూలము చేసికొనుట ద్వారా మనము ఎలా ప్రయోజనము పొందుకొనగలమో సలహా ఇచ్చును. సాతాను దేవుడు నియమించిన హద్దులలోనే పనిచేయును (1 కొరింథీయులకు 10:13), కానీ మనము వ్యక్తిగతముగా ఏమి కోరుకొందుమో దానిని మనకిచ్చుచు మనలను ఎలా వ్యక్తిగతముగా శోధించాలో వానికి తెలియును.
2. సాతాను చేత సమకూర్చబడిన బహిర్గత అవకాశము అంతరంగములోని ఒక ఆశను – తప్పు చేయుట ద్వారా పొందుకొనబడగల ప్రయోజనము కొరకైన ఆశను – కలిసికొనును.
3. మన కోరిక తప్పు చేయుట ద్వారా ప్రయోజనము పొందుకొనుటకు తగిన అవకాశము అందుబాటులో ఉన్నప్పుడు, తప్పు చేయవలెనను ఉబలాటము సృష్టింపబడును; అప్పుడు మనము చేయకూడని దానిని చేయగోరుదుము. ఆ కోరికయే శోధనయై యున్నది.
4. అప్పుడు మనము మనలో కలుగు ఉబలాటము చొప్పున చేయుటకు లేదా చేయకుండునట్లు ఎంపిక చేసికొనుటకు, లొంగిపోవుటకు లేదా తప్పించుకొనుటకు గల దేవుని మార్గమును వెదకుటకు మనకొక అవకాశముండును (1 కొరింథీయులకు 10:13 చూడుము).
5. మనము శోధనకు లొంగిపోయినట్లయితే – మనము చేయగోరునది చేసినట్లయితే – మనము పాపము చేసినవారమగుదుము, మనము శోధనను ఎదిరించి మన ఉబలాటము ప్రకారము చేయుటకు నిరాకరించినట్లయితే, మనము పాపము చేయము.
6. మనము శోధనకు లొంగిపోయి తప్పు చేయుట ద్వారా పాపము చేసినట్లయితే, దాని ఫలితం మరణమే – ఆధ్యాత్మిక మరణము, దేవుని నుండి వేరగుట. మనము పట్టువిడువక పాపములోనే జీవించనట్లయితే, దాని వెంట వచ్చేది నిత్య మరణమే.

యాకోబు 1:14, 15లో గల వరుసక్రమము విశేషమైన అర్థంతో కూడినదైయున్నది: ఒకడు "తన స్వకీయమైన దురాశ (కోరిక) చేత ఈడ్వబడి" మరియు "మరులుకొల్పబడి" పాపము చేయుటకు తీర్మానించుకొనును. అప్పుడు "అది పరిపక్వమై" మరణమును కనును. ఇక్కడ ప్రాముఖ్యమైన వాస్తవమేమనగా, కోరికయే పాపము కాదు.[8] కాబట్టి, శోధన పాపము కాదు. కేవలము ఏదో ఒక తప్పు చేయాలని ఆశించుటయే పాపముకాదు. శోధింపబడుట పాపము కాదు, శోధనకు లొంగిపోవుట పాపము! అదే సమయంలో, మనము శోధన గూర్చి అప్రమత్తముగా యుండవలెను, ఎందుచేతనంటే శోధన – మన కోరికల చేత రెచ్చగొట్టబడినదై – పాపము చేయుటకు దారి తీయును, ఆప్పుడు పాపము మరణమును కనును!

### అబద్ధము నెం. 5

**అబద్ధము: "నీవు శోధింపబడినట్లుగా ఇతరులు ఎన్నడును శోధింపబడలేదు."**

**సత్యము: ప్రతి ఒక్కరు విశిష్టమైనవారే, కానీ ప్రతి ఒక్కరు అదే విధమైన శోధనలు ఎదుర్కొందురు.**

బహుశ మనమందరము, ఒకప్పుడు కాకపోయినా మరొక్కప్పుడు, ఇతరులెవరునూ మనము శోధింపబడుచున్నంతగా ఎప్పుడైనాగాని శోధింపబడలేదను అబద్ధపు అభిప్రాయమును నమ్మాము. అలాగైతే, పౌలు పలికిన మాటలు మనము మరొకసారి వినవలసి యున్నది: "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు" (1 కొరింథీయులకు 10:13ఎ).

మనలో ఒక్కొక్కరము ఒక్కొక్క విధంగా విశిష్టమైనవారమై యుండగా, మనమందరమును అదే విధమైన శోధనలకు గురి యగుదుము. మనమందరమును ఆదాము హవ్వల వలెనే, యేసు వలెనే,[9] "శరీరాశయు నేత్రాశయు జీవపుడంబము" చేత శోధింపబడుదుము (1 యోహాను 2:16). వాస్తవమునకు, యేసే "సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను" అని హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక మనకు అభయము నిచ్చుచున్నది (హెబ్రీయులకు 4:15). "ఇతరులెవరైనను శోధింపబడని విధంగా నేను శోధింపబడ్డాను" అని చెప్పుచు ఏ ఒక్కరును శోధనకు లోనగుట నుండి తప్పించుకొనలేరు.[10]

## అబద్ధము నెం. 6

**అసత్యము: "శోధన బలమైనదిగా ఉన్నప్పుడు, నీవు దానిని ఎదిరించుటకు నీకు ఏ మార్గము లేదు."**

**సత్యము: క్రైస్తవులు శోధింపబడినప్పుడు దేవుడు వారికి సహాయము చేయును, కానీ క్రైస్తవులు ఆ శోధన నుండి తప్పించుకొనుటకు ఆయన సమకూర్చు మార్గమును వెదకవలెను.**

శోధన బహు బలముగా వచ్చినదండీ, దానినెదిరించుటకు నాకు శక్తి చాలలేదు, అందుకే నేను పాపంలో పడిపోయాను' అని స్వాధికారముతో చెప్పుచు తప్పించుకొనుటకు అనేకులు మొగ్గుచూపుదురు, ఏదిఏమైనా, పౌలు 1 కొరింథీయులుకు 10:13లో వెలిబుచ్చుచుండిన అభిప్రాయము అదే: "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు; దేవుడు ... మీరు సహింపగలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును."

శోధన నీవూ నేను ఎదిరింపలేనంతటి బలమైనదా? అయియుండవచ్చును, ఒక వాస్తవమైన విషయంలో తప్ప – ఆ వాస్తవము దేవుడైయున్నాడు! శోధన కాలములలో ఆయన మనకు సహాయము చేయనట్లయితే, మనము శోధనను ఎదిరించుటకును నీతిమంతమైన జీవితములను జీవించుటకును మనకు అవకాశములు ఉండవు.

ఏదిఏమైనా, దేవుడు మన పక్షముగానున్నాడు, మనము శోధనలు జయింపగలుగునట్లు ఆయన మనకు సహాయము చేయును! "మమ్మును శోధనలోకి తేక, కీడు (లేక దుష్టుని) నుండి

మమ్మును తప్పించుము" అని మనము దేవుని ప్రార్థించవలెనని యేసు మనకు బోధించాడు (మత్తయి 6:13). మనకు శోధన ఎదురైనప్పుడు, మనము ఎదుర్కొన గల శక్తికి మించి మనము శోధింపబడునట్లు దేవుడు మనలను అనుమతించడు సరికదా ఆ శోధన నుండి తప్పించుకొను మార్గమును సహితము సమకూర్చునను అభయమునకు మనము హత్తుకొని యుండవలెను.

మనము సహింపగలిగిన దాని కంటె ఎక్కువగా మనము శోధింపబడునట్లు దేవుడు అనుమతించడని చెప్పుటకు యోబు ఒక చక్కని ఉదాహరణమై యున్నాడు. యోబును వాడు శోధించునట్లు దేవుడు సాతానుకు అనుమతి నిచ్చాడు, కానీ వాడు కొంత మేరకే వెళ్లగలిగాడు. వాడు యోబు సహింపగలిగిన దాని కంటె ఎక్కువగా ఆయనను శోధించునట్లు వానిని దేవుడు అనుమతించలేదు. మనము శోధింపబడినప్పుడు దేవుడు మన కొరకు సమకూర్చు రెండవ రకమైన మార్గము గూర్చి యోసేపు కథ ఒక ఉదాహరణమై యున్నది. యోసేపు తప్పించుకొనగలుగునట్లు దేవుడు ఆయనకు ఒక చక్కని మార్గమును సమకూర్చాడు: అతడు ఆమెతో వ్యభిచరించవలెనని పోతీఫర్ యొక్క భార్య పట్టువిడువక బలవంతము చేసినప్పుడు ఆయన ఆమె చేతిలో నుండి తప్పించుకొని పారిపోవుటకు తెరువబడి యుండిన ద్వారమును మరియు పరుగెత్తుటకు శక్తిగల కాళ్లను దేవుడు సందర్భానుసారంగా సమకూర్చాడు (ఆదికాండము 39:11-18).

శోధన నుండి తప్పించుకొనగల మార్గమును దేవుడు ఎల్లప్పుడు సమకూర్చుచూ, మనము పాపము నుండి దూరముగా పారిపోవునట్లు ఆయన మనలను బలవంతము చేయడు, కానీ ఆ తీర్మానమును మనకే విడిచిపెట్టును. చాలా మంది క్రైస్తవులు, శోధన నుండి పారిపోవుటకు బదులుగా, దానిని ఆహ్వానిస్తారు. వారు ఎక్కడైతే శోధింపబడగలరో అక్కడికే, వారిని యింకా ప్రలోభపెట్టు కార్యకలాపములలో వారు నిమగ్నమగునట్టు వారిని శోధించువారితోనే వెళ్తారు. మనము శోధన నుండి పారిపోవుటకు బదులుగా దానిని ఆహ్వానించినట్లయితే, "మమ్మును శోధనలోకి తేకుము" అని ప్రార్థించినప్పుడు మనము వేషధారులమగుటలేదా?

ఎలాగైనా, "శోధన చాలా బలమైనదైయుండినదండీ, దానిని ఎదిరించుటకు నాకు శక్తి చాలక పాపములో పడిపోయాను" అను నెపములు చెప్పుట ద్వారా క్రైస్తవులు పాపము చేయుట నుండి తప్పించుకొనజాలరు.

## అబద్ధము నెం.7

**అసత్యము: "నీవు క్షమింపబడలేనంతగా శోధనలకు లొంగిపోయి పాపము చేసావు."**

**సత్యము: వాడు చేసిన పాపము గూర్చి మారుమనస్సు పొంది క్షమాపణ కొరకు వెదకు ప్రతివాని ఏ పాపమునైనను దేవుడు క్షమించగలడు మరియు ఆయన క్షమిస్తాడు.**

మనము ఒక సారి పాపమునకు "సరే" అని చెప్పి దానికి లోనైనప్పుడు, మనము ఆ పరిస్థితిలో మన జీవితాంతమువరకు చిక్కుకొనిపోయామనియు, మనము చేసిన ఘోరమైన పాపములనుబట్టి దేవుడు మనలను అంగీకరించడనియు నమ్మునట్లు అపవాది ఆశిస్తాడు. సహజంగానే, సత్యము మరొక విధంగా ఉన్నది. దేవుడు మనలను ప్రేమించుచున్నాడు,

మరియు మనము చేసిన ఏ పాపమునైనను క్షమించుటకు ఆయన కృప చాలినంత గొప్పదై యున్నది. దావీదు చేసిన వ్యభిచారము మరియు హత్యనుబట్టి దేవుడు ఆయనను క్షమించాడు, యేసును ఎరుగనని ముమ్మారు బొంకిన పేతురును ఆయన క్షమించాడు. వాస్తవమునకు, క్రీస్తును సిలువవేసిన ప్రజలనే దేవుడు క్షమించాడు. ఆయన మనలను కూడా క్షమించగలడు, క్షమిస్తాడు!

## ముగింపు

అపవాది చెప్పుచుండు అబద్ధములను మనము యిక ఎన్నటికినీ నమ్మకూడదు! నీవు శోధనకు లొంగిపోయి పాపము చేసియున్నట్లయితే, దేవుడు నిన్ను క్షమించగలడు మరియు క్షమిస్తాడు. పాపము నుండి మరలి క్రీస్తు యొద్దకు రమ్ము!

---

సూచనలు

[1]10:9లో వాడబడిన "శోధింపక" అను పదమునకు గ్రీకు అనువాదము – ఎక్‌పెయ్‌రజొ. [2]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testment Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 116. [3]Alex R. G. Deasley, "Temptation, Test," *Baker Theological Dictionary of the Bible* (Grand Rapids, Mich.: Baker Books, 2000), 762. [4]ఈ వాక్యభాగములన్నిటిలోను, మొదట్లో పెయ్‌రజొ అనునది ఈ పదము యొక్క రూపమై యున్నది. ఇదే క్రియాపదము "యత్నము చేసెను" అనియు "ప్రయత్నముచేసిరి" అనియు అపొస్తలుల కార్యములు 9:26; 26:21లో వాడబడినది. [5]దేవుడు ప్రజలను శోధించాడని తెలియజెప్పు ఈ వాక్యభాగము మరియు ఇతర వాక్యభాగముల మధ్య పరస్పరము వ్యతిరేకమైయున్న విషయాన్ని కొందరు సూచిస్తారు. ఉదా॥ ఆంగ్ల కే జే వి అనువాదం ప్రకారం, దేవుడు అబ్రాహామును శోధించాడు (ఆదికాండము 22:1). ఇటువంటి వాక్యభాగములలో ఈ పదము ఒకరు పాపము చేయునట్లు వారిని ప్రలోభపెట్టుట అను అర్థము కంటె "పరీక్షించుట" అను అర్థముతో వాడబడినదనుట ఉత్తమమైన వివరణయై యున్నది. ఎంచేతనంటే ఒకరు పాపము చేయునట్లు దేవుడు ఎవరినీ శోధించడు. [6]సాతాను ఒక శోధకుడు, విరోధి, లేక వంచకుడు అని తెలియజెప్పు వాక్యభాగముల కొరకు 2 కొరింథీయులకు 2:11 మరియు ప్రకటన 2:10; 12:9 చూడుము. [7]గ్లెన్ పేస్, జడ్సోనియా చర్చ్ ఆఫ్ క్రైస్ట్, అర్కాన్సస్, ఎన్ డి. లో ప్రబోధించబడిన ప్రసంగము నుండి ఈ ఘోషణ అనువుగా నుండునట్లు మలుచుకొనబడినది. [8]మత్తయి 5:28లోని "మోహపు చూపు" (ఎపితుమియొ) కేవలము వ్యభిచరించవలెనని క్షణకాలముండు కోరికను మాత్రమే సూచింపకూడదు. బహుశ, ఒక స్త్రీ యెడల బలముగా, ఎడతెగకుండా మోహపు చూపుతో చూచినప్పుడు, అది వాస్తవముగా, పరిస్థితులు అనుకూరించినట్లయితే వ్యభిచారము చేయునట్లు దారి తీయునని దాని అర్థమై యున్నది. [9]1 కొరింథీయులకు 10:1–12లో పౌలు కొరింథీయులను హెచ్చరించిన పాపములను ఇశ్రాయేలీయులు చేసిన పాపములతో పోల్చుట ద్వారా ప్రతి యుగములోని శోధన మరియు పాపమునకున్న పోలిక గూర్చి కూడ సలహా ఇవ్వబడుచున్నది. [10]"శోధనకు లోనగుట ఎన్నడును అనివార్యమైనది కాదు. అంధకార శక్తులపై క్రీస్తు విజయాభవుడగుట (మత్తయి 12:28–29; కొలొస్సయులకు 1:13) ఆయన యందు ఐక్యమై యుండువారు శోధనను తప్పించుకొనగల ద్వారము ఎల్లప్పుడు తెరవబడి యున్నదను అర్థము నిచ్చుచున్నది (1 కొరింథీయులకు 10:13)" (Deasley, 762).